క్లుప్తంగా

నేత్రపర్వంగా అలఘునాథుని కల్యాణోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్ల మూలవిరాట్టులకు విశేషాభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఉత్సమూర్తులను సుందరంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరిరూరల్: మండలంలోని బండగాని పల్లెలో బుధవారం నుంచి జరుగుతున్న సీతారాముల ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం సీతారాములకు విశేష పూజలు, మధ్యాహ్నం వసంతోత్సవం, పారువేటను వేడుకగా నిర్వహించారు.

పెంచలకోనకు ప్రత్యేక బస్సులు

ఆత్మకూరురూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనకు ఈ నెల 10, 11 తేదీల్లో ఆత్మకూరు నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కరిమున్నీసా శుక్రవారం తెలిపారు. పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆత్మకూరు పరిసర ప్రాంతాల నుంచి వెళ్లే భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా తెలిపారు. ఆత్మకూరు డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలు, ఫిర్యాదులను 99592 25645 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్టంగా రూ.280 ధర పలికింది. వేలానికి 781 బేళ్లు రాగా, 543 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సగటున రూ.256.30 ధర నమోదైందని వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 367 బేళ్లను తీసుకురాగా, 291 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సరాసరిన రూ. 249.04 ధర నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

మురళీనాయక్ వీరమరణంపై సంతాపం

కావలి(జలదంకి): శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గానికి చెందిన జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందడంపై కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దేశభద్రత కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని మరువలేమన్నారు. శోకతప్తులైన జవాన్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

చేజర్ల(ఆత్మకూరు): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్, చేజర్ల ఎంపీడీఓ ఎస్ వసుంధరదేవి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మైనార్టీల స్వయం ఉపాధికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందజేయనున్నట్లు చెప్పారు. అర్హులైన మైనార్టీలు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో లేదా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

న్యాయం చేయాలని వినతి

వింజమూరు(ఉదయగిరి): కోర్టు ఆర్డర్ ఉన్నా రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు ఎక్కించకుండా రెవెన్యూ అధికారులు అన్యాయం చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ సభ్యుడు గురజాల వెంకటరమణ్య ఆరోపించారు. వింజమూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో తమ కుటుంబానికి వింజమూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 244-1, 245-1, 245-2లో 12.41 ఎకరాల భూమిని పట్టాగా ఇచ్చి ఉన్నారని తెలిపారు. గతంలో మండల స్థాయి రెవెన్యూ అధికారులు తమ పేర్లు తొలగించగా కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకున్నామని చెప్పారు. అయినా రెవెన్యూ అధికారులు తమ పేర్లను రికార్డుల్లో ఎక్కించకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

అఖరి మజిలీకి అవస్థలే

- అధ్వానంగా శ్మశానవాటికలు
- అంతిమ సంస్కారాలకు తప్పని పాట్లు



మురగళ్లలో కంపచెట్లతో నిండిన పాఠశాల సమీపంలోని శ్మశానవాటిక



ముళ్లపొదలతో నిండిన మురగళ్లలోని ఎస్సీకాలనీవాసుల శ్మశానం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో శ్మశానవాటికలు అధ్వానంగా తయారవడంతో అఖరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు. శ్మశాన వాటికల్లోకి వెళ్లేందుకు సైతం వీల్లేకుండా కంపచెట్లు దట్టంగా పెరిగిపోవడంతో మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. గతంలో ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అప్పారావుపాళెం, ఆరవేడు జంగాలపల్లి, బట్టేపాడు, బోయలచిరివెళ్ల, చెర్లోయడవల్లి, దేపూరు, మహిమలూరు, మురగళ్ల, నాగులపాడు, నల్లపరెడ్డిపల్లి, నువ్వూరుపాడు, పడకండ్ల, పమిడిపాడు, రామస్వామిపల్లి, రావులకొల్లు, సాతానుపల్లి గ్రామాల్లో శ్మశానవాటికలను నిర్మించారు. ప్రస్తుతం వాటిల్లో కంపచెట్లు దట్టంగా పెరిగిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. శ్మశానాల్లోకి వెళ్లే దారులను సైతం కంపచెట్లు ఆక్రమించాయి. దీంతో ఎవరైనా చనిపోయిన సమయంలో మృతుల కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు చేసేందుకు నరకయాతన చవి చూస్తున్నారు. మరోవైపు ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన శ్మశాన వాటికలు కొన్ని గ్రామాల్లో కొందరికే పరిమితమయ్యాయి. వాటిలో ఎస్సీ, ఎస్టీలకు ప్రవేశం లేని కారణంగా ఆయా వర్గాల వారు ఇప్పటికీ అవస్థలు పడుతున్నారు. గతంలో మురగళ్లలో టీడీపీ నాయకులు అనాలోచితంగా జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో శ్మశానవాటికను నిర్మించారు. ప్రస్తుతం అది ముళ్లపొదలతో నిండి విషసర్పాలకు నిలయంగా మారడంతో మృతదేహాలను ఖననం చేసేందుకు ప్రజలు అవస్థ పడుతున్నారు. మరోవైపు పాఠశాలలోకి విషపురుగులు వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే మురగళ్లలో ఎస్సీకాలనీవాసులు ఊరికి దూరంగా వినియోగిస్తున్న శ్మశానవాటిక సైతం ముళ్లపొదలతో నిండి మృతదేహాల ఖననానికి వీల్లేకుండా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అఖరి మజిలీకి అవస్థలు లేకుండా శ్మశాన వాటికల్లోని కంపచెట్లను తొలగించి సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న మద్దిబోయిన రఘు

బిట్రగుంట: అవినీతి, అక్రమాలను ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని బోగోలు మండల వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిబోయిన రఘు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై బోగోలు మండల టీడీపీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు చేసిన ఆరోపణలను ఖండించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అరాచక పాలన సాగిందని మాలేపాటి మాట్లాడుతుంటే జనాలు నవ్వుకుంటున్నారన్నారు. డబ్బులొచ్చే పనుల గురించి ఆలోచించడం తప్ప, తన సొంత పార్టీ గురించి ఏ రోజు ఆలోచించని ఆయన ఇప్పుడు ఎమ్మెల్యే మెప్పు కోసం ప్రెస్‌మీట్లు పెట్టి హితోపదేశాలు చేస్తుండడం చూస్తే నవ్వొస్తోందన్నారు. గ్రామ కంతాన్ని ఎవరు స్వాహా చేశారో.. సీజేఎఫ్ఎస్ భూమి మీ తమ్ముడి పేరు మీద ఎలా వచ్చిందనే వాటికి సమాధానం చెప్పగలరా మాలేపాటి అని నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు తీసుకున్నారని మాలేపాటి తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని, ఇప్పుడు కూడా అదే కాంట్రాక్టర్లే పనులు చేస్తున్నారని, ఒక్కరి చేత అయినా కమీషన్లు తీసుకున్నారని చెప్పించగలరా అని ప్రశ్నించారు. నవరత్నాలు ఎవరికీ అందలేదని ఆయన మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క పథకం కూడా ఇవ్వకుండా జనాల్లోకి వెళ్తే కొడుతారని భయపడుతున్న మీరా మాట్లాడేదన్నారు. పింఛన్ పెంపు పేరుతో లక్షల పింఛన్లను తొలగించడం నిజం కాదా అన్నారు. ఉచిత గ్యాస్ పేరుతో 100లో 20 నుంచి 30 మందికి మాత్రమే ఇస్తూ జనాలను మోసం చేస్తున్న మీరా మాట్లాడేదన్నారు. మాలేపాటి తన స్థాయిని తెలుసుకుని విమర్శలు చేయాలని హితువు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని హరిహర క్షేత్రంలో కొలువైన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి అంకుర్పాణతో ప్రారంభమయ్యాయి. రాత్రి 7గంటలకు ఆలయ అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ఆలయ శుద్ధి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పుట్టమన్ను తెచ్చి నవధాన్యాలు చల్లి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఎల్‌సీ కొండారెడ్డి, ఆలయ ఈఓ శాంతయ్య ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు భక్తులకు అన్నీ రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. కల్యాణోత్సవం, అలకలతోపు కార్యక్రమాల్లో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారని చెప్పారు. ప్రస్తుతం ఆలయ వార్షిక ఆదాయం రూ.13.70 లక్షలు ఉందని, దీనిని రాబోవు మూడేళ్లలో రూ.30 లక్షలకు పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

గొలుసు పట్టాలంటే కాసులు ఇవ్వాల్సిందే



భూ సర్వే చేస్తున్న సర్వేయర్లు (ఫైల్)

సీతారామపురం: మండలంలో భూముల సర్వేకు సంబంధించిన సమస్యలు అధికంగా ఉండడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు గ్రామ సచివాలయ సర్వేయర్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. తమ స్థాయికి మించి దర్పాన్ని ప్రదర్శిస్తూ అమాయక ప్రజలతో ఆడుకుంటూ వారికి చుక్కలు చూపిస్తున్నారు. మండలం చుట్టూ మూడు జాతీయ రహదారుల నిర్మాణం చేస్తున్నారు. దీంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వ్యవసాయానికి పనికిరాని భూములు సైతం మంచి ధరలు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్వేయర్ల అవసరం ప్రజలకు ఎక్కువైంది. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు సర్వేయర్లు చిన్నపాటి సర్వే చేయడానికి కూడా పెద్ద మొత్తంలో నగదు డిమాండ్ చేస్తున్నట్లుగా బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. ఇంటి స్థలాలు, భూములకు సంబంధించిన హద్దులు చూపాలన్నా, సర్వే చేయాలన్నా ఇంతిస్తే తప్ప మేము సర్వే చేయమంటూ భీష్మించుకుని కూర్చుంటున్నారు. దీంతో చేసేదేమీ లేక కొందరు మౌనంగా రోదిస్తూ ముడుపులు చెల్లించుకుంటున్నారు. సర్వేకు డబ్బులు కట్టినా, కట్టకపోయినా కాసులిస్తే సర్వేయర్లు వాలిపోతున్నారు. కొందరు నగదు రూపేణా తీసుకుంటే మరికొందరు యూపీఐ ద్వారా కాసులు తీసుకుంటున్నట్లు సమాచారం. మరికొందరు అక్కడ ఆ భూమి ఉంది, ఇక్కడ ఈ భూమి ఖాళీగా ఉందని..ఇది మీకు కలుస్తుంది..పట్టాదారు పాస్‌పుస్తకాలు సైతం మేమే తెచ్చి పెడుతామంటూ ఆశలు రేపుతూ అప్పనంగా సొమ్ము దోచేస్తున్నారనే విమర్శలున్నాయి. మరికొందరైతే తమ జీతం కన్నా గీతం ఎక్కువ వచ్చే విధంగా ప్రణాళికలు రచిస్తూ సొమ్ములు దండిగా దోచేస్తున్నారు. కొన్నిచోట్ల పొలాలు ఆక్రమించి బినామీ పేర్లతో పట్టాలు పొంది తమ ఆస్తిని పెంపొందించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా మండలంలో సర్వేయర్ల ఆగడాలు శృతిమించడంతో వారి భాగోతంపై రెండ్రోజుల క్రితం కొందరు అధికార పార్టీ శ్రేయోభిలాషుల పేరుతో కరపత్రాలను సైతం పంచడం విశేషం. సర్వేయర్ల వ్యవహారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాల్య వివాహాలతో అనర్థాలు



చేజర్ల(ఆత్మకూరు): బాల్యవివాహాలతో ఎన్నో అనర్థాలు తలెత్తుతాయని, 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సురేఖ బాలికలకు సూచించారు. చేజర్లలోని గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నవయస్సులో వివాహాలు చేసుకుంటే శారీరక ఎదుగుదల లోపిస్తుందన్నారు. చిన్నవయస్సులో గర్భం దాల్చడం వల్ల మాతాశిశు మరణాలకు తోడు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి బాలికలను చక్కగా చదివించాలని సూచించారు. ఏఎన్‌ఎం లక్ష్మీనారాయణమ్మ, అంగన్‌వాడీలు దేవి, మాధవి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



బస్టాండ్ ప్రాంతంలోని ఓ ఇంట్లోకి చేరిన మురుగునీరు

జలదంకి: మండల కేంద్రమైన జలందంకిలోని బస్టాండ్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రైనేజీలు పూడిపోయి మురుగునీరు ఇళ్లలోకి వస్తోంది. మరోవైపు దోమలు వృద్ధి చెందుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలాధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

12 నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

సంగం: మండలంలో ఈ నెల 12 నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షాలెట్ శుక్రవారం తెలిపారు. 12, 13 తేదీల్లో పడమటిపాళెం, వంగల్లు, తరుణవాయి, 14, 15 తేదీల్లో దువ్వూరు, మర్రిపాడు, కొరిమెర్ల, పెరమన సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులు ఉంటాయని చెప్పారు. ఆరేళ్లలోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం స్పెషల్ క్యాంపులను నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

జలదంకి: కొత్త రేషన్‌కార్డులకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం కొత్త కార్డుల మంజూరుతో పాటు ప్రస్తుతం ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని చెప్పారు. గ్రామ సచివాలయాల్లో రైస్‌కార్డుకు సంబంధించి ఏడు రకాల సర్వీసులను ప్రారంభించినట్లు తెలిపారు. కొత్త కార్డు, పాతకార్డులో సభ్యుల చేరిక, కార్డును విభజించటం, కార్డు నుంచి సభ్యుల తొలగింపు, కార్డును అప్పగించటం, చిరునామా మార్పు, తప్పు ఆధార్ సీడింగులను సరిదిద్దడం వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



మర్రిపాడు: మండలంలోని అచ్చమాంబ ఆలయం వద్ద శుక్రవారం బైక్ అదుపుతప్పిన ఘటనలో అనంతసాగరం మండలం వెంగంపల్లికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంపు



సాక్షి ఎఫెక్ట్..

సోమశిల: అనంతసాగరం మండలం పాతాళపల్లిలో ఉత్తరకాలువ పక్కన నేలపై ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. ఈ విషయమై 'సాక్షి'లో నాలుగు రోజుల క్రితం 'ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు' శీర్షికన కథనం రావడంతో విద్యుత్‌శాఖ ఏఈ సురేష్‌బాబు స్పందించారు. సిమెంట్ వరలపై ఐదు అడుగుల ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించారు. వాటి చుట్టూ రక్షణ కంచెను సైతం నిర్మించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు: అల్లూరు సబ్‌స్టేషన్, నార్తుమోపూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ షేక్ మస్తాన్ శుక్రవారం తెలిపారు. అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అల్లూరు టౌన్, నార్త్‌మోపూరు సబ్‌స్టేషన్ పరిధిలోని నార్త్‌మోపూరు, నార్త్‌ఆములూరు, బీరంగుంట, తదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిల, అనంతసాగరం, రేవూరు, చిలకలమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఎం సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. 33కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌తో కలకలం



శివకుమార్

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేయడంతో వింజమూరులో కలకలం రేగింది. ఆయన కోవూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన సమయంలో రూ.1.70 కోట్ల మేర నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణలో తేలడంతో విధుల నుంచి తొలగించారు. ఆయన గతేడాది అక్టోబరులో వింజమూరు పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరారు. వింజమూరులోనూ పలు అక్రమాలకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా కొత్త లేఅవుట్ల ఏర్పాటు, ఆస్తి, కుళాయి పన్నులు, కొత్త భవనాలకు అనుమతులు, తదితర అంశాల్లో నిబంధలకు వ్యతిరేకంగా అనుమతులు ఇచ్చి లంచాలు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వింజమూరులో కూడా సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



కావలి(జలదంకి): గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు, ఆరోగ్యవంతమైన బిడ్డ కోసం పోషకాహారం తీసుకోవాలని కావలిలోని వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యులు ఎం మహేష్ సూచించారు. వెంగళరావునగర్ హెల్త్ సెంటర్‌లో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథంకం కింద గర్భిణులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్యజాగ్రత్తలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం కాల్షియం, ఐరన్ సిరఫ్‌లు పంపిణీ చేశారు. డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు

అల్లూరు: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని మండల హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీలో బీఎమ్మార్ కాలనీలో ఎస్టీలకు గృహ నిర్మాణాలపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వం గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు రూ. 1.80లక్షలకు తోడు అదనంగా ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల చొప్పున మంజూరు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని అసంపూర్తిగా ఉన్న గృనిర్మాణాలను పూర్తిచేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు



అనుమసముద్రంపేట(ఆత్మకూరు): పొరుగుదేశంతో యుద్ధం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్‌పేటలో ఎస్సై సైదులు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వేకువజామున ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రముఖ యాత్రస్థలమైన ఏఎస్‌పేటకు భక్తుల ముసుగులో సంఘవిద్రోహశక్తులు ఎవరైనా వస్తారేమోనన్న అనుమానంతో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లాడ్జిలు, భక్తులు బసచేసే అద్దె గదులను తనిఖీ చేసి అందులో ఉన్న వారి ఆధార్‌కార్డులను పరిశీలించారు. హెడ్‌కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది పవన్, షబ్బీర్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరిలో వర్షం

ఉదయగిరి: పట్టణంలో గురువారం రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి ముందు ఈదురుగాలులు బలంగా వీయడంతో ఫ్లెక్సీలు, హోర్డింగులు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పలు గృహాల్లో విద్యుత్ గృహోపకరణాలు దగ్ధమయ్యాయి.


వైభవంగా హనుమంత సేవ

సీతారామపురం: మండలంలోని పండ్రంగి సమీపంలోని పాండురంగ వితలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం పాండురంగ స్వామికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సీతారామపురంలోని పడమటివీధికి చెందిన వారు ఉభయదాతలుగా హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రీవెన్స్



అల్లూరులో అర్జీలు స్వీకరిస్తున్న కావలి ఆర్డీఓ వంశీకృష్ణ



సీతారామపురం: అర్జీలు స్వీకరిస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ పావని

సీతారామపురం: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ పావని తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల ప్రత్యేక పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీఓ పాల్గొన్నారు. ప్రజల నుంచి 48 అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కరించదగిన వాటికి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపుతామన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు రెవెన్యూ సేవలు సక్రమంగా అందడం లేదని ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్డీఓ మెరుగైన సేవలు అందించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆరులైన్ల భారతమాల జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ అనుమతులకు స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ గ్రీవెన్స్‌కు 15 అర్జీలు

అల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల ప్రత్యేక పరిష్కార వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కావలి ఆర్డీఓ వంశీకృష్ణ పాల్గొని అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి 15 అర్జీలు అందగా వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మండలాధికారులు పాల్గొన్నారు.